4-4-86 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

# భార్యాగుణవతి శత్రుః

పి.గోపీచంద్



నీళ్ళలో ఉడకబెట్టిన బొంబాయి రవ్వ... కాస్త ఉప్పు, పచ్చిమిరపకాయలు, అల్లం ముక్కలు, కరివేపాకు. ఆ పదార్థం పైన ఓ ఆరు జీడిపప్పులు.

ఆ ప్లేటు నేలకేసి కొట్టినా విశ్వానికి కోపం పోదు.

"ఇది టిఫినేనా?" అడిగాడతను.

"అయ్యో! నెయ్యి వేసి చేశానండీ ఉప్మా! అలా అంటారేంటీ?" అతని భార్య అంది.

"ఇది టిఫిన్ కాదు! రుచీ పచీలేని ఎండుగడ్డి. ప్రొద్దున్నే ఆకల్తో దీన్ని నమలాలా?" విశ్వానికి కడుపు మండి పోయింది.

"ఇవ్వాళ పనిమనిషి రాలేదు. పిండి రుబ్బ లేదు. రేపు మంచి టిఫిన్ చేస్తాను" అతని భార్య నసిగింది.

ప్రొద్దున్నే ఆఫీస్‌కి ఆ పదార్థం తిని వెళ్ళాలని తెలిస్తే విశ్వానికి ఒళ్ళు మండుకుపోతోంది. మధ్యాహ్నం ఒకటిన్నరదాకా ఏమీ తినకుండా వుండాలంటే ఇది తినక తప్పదు. ఇప్పుడు గానీ తింటే రేపూ తన కిష్టం లేని ఈ గడ్డి తినాల్సి వుంటుంది.

విసిరేయకపోయినా గట్టిగా చప్పుడయ్యేలా డ్రెసింగ్ టేబుల్ మీద ఆ ప్లేట్ పడేసి "నేను తినను" అన్నాడు.

ఆమె చాలా బాధ పడిపోయింది. ఆ పదార్థాన్ని చేయడానికి కూడా ఆమె నిజంగా అవస్థ పడింది. అవతల పిల్లల్ని కూడా స్నానం చేయించి స్కూల్‌కి పంపాలి. "అయ్యో! ఇవాల్టికి ఇది తినేయండి. రేపు దోసెలు వేస్తాను. లేకపోతే చేసినదంతా వేస్టయి పోతుంది" ఆమె బ్రతిమలాడుతోన్నట్టు అంది.

విశ్వం ఆమె రేపు దోసెలు వేస్తాననగావే తిందామనుకున్నాడు. కానీ ఆ తరువాత ఆమె చేసినదంతా వేస్టయి పోతుంది అన్న పదం విన్నాక ఖిన్నుడై పోయాడు. ఆ పదార్థం తినేయాలన్న కోర్కెను బలవంతాన చంపుకున్నాడు. అభిమానంతో ఆ ప్లేటును వదిలి నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు.

అతని భార్య అతనువదిలి వెళ్ళిన ప్లేట్ కేసి చాలా బాధగా చూస్తూ "ఈయనకు ఇంతకన్నా రుచిగలవి ఇంకెలా చేయను?" అని వాపోతూ "... ఈ పని ఎ సరిగ్గా వచ్చి చావకే నాకీ తిప్పలన్నీ. ఎలా వేగను ఈయన మొండితనంతో"–విసుక్కుంది.

* * *

విశ్వం ఖాళీ కడుపు హోటల్ కేసి చూసింది. కాళ్ళు దాన్ని లోపలికి లాక్కుపోయాయి.

'ఇంట్లో నాకు నచ్చినవి చేయకపోతేనేం? నేను హోటల్లో తినలేనా!' అతను అనుకున్నాడు.

ఉల్లిపాయదోసె, పూరీ తిన్నాక అతని ఆకలి తీరి పోయింది.

వాష్ బేసిన్‌లో చేయి కడుక్కుంటూ అతడు యాథాలాపంగా కిచెన్ లోకి చూశాడు.

అతడికి ఒక్కసారి కడుపులో చెయ్యి పెట్టే తిన్నదంతా బయటకు తీసెయ్యాలనిపించింది.

లోపల ఓ వంటవాడు ఇంతకు ముందు హోటల్ ఊడ్చిన చీపురుతో దోసెలు వేసే పెనం కడుగుతూ వున్నాడు.

* * *

మరో నెల తరువాత తిరిగి అనుకోకుండా పని మనిషి రాని హడావుడిలో అతని భార్య అతనికి ఉప్మా చేసి అందిస్తూ భయంగా చూసింది.

అప్పుడే కాదు–ఆ తరువాతెప్పుడూ కూడా అతను ఏ టిఫెన్‌కీ వంక పెట్టలేదు. ఆమెను ఏమీ అనలేదు. ●